క్లుప్తంగా

నేటి నుంచి స్తంభాద్రి గ్రామీణ కళామేళా

ఖమ్మంగాంధీచౌక్: నాబార్డ్ సహకారంతో శనివారం నుంచి మూడు రోజుల పాటు(21 నుంచి 23వ తేదీ వరకు) ఖమ్మం నగరంలోని వీడీవోస్ కాలనీలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో స్తంభాద్రి గ్రామీణ కళామేళా నిర్వహిస్తున్నట్లు జాగృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కుముదిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వివిధ జిల్లాలకు చెందిన గ్రామీణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్యం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఈ మేళాను ప్రజలు ఆదరించాలని కుముదిని కోరారు.

సన్మానం..

కామేపల్లి(కారేపల్లి): ప్రముఖ నిత్య సంకీర్తనాచార్యులు కీర్తి పురస్కార గ్రహీత గొట్టుపర్తి శివాజీని అవదూతేంద్ర భక్తమండలి సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గత మూడు దశాబ్దాలుగా వివిధ ప్రాంతాలలో సంకీర్తన చేస్తు భగవన్నామాన్ని వ్యాప్తింపజేస్తున్న శివాజీ ఇటీవల కీర్తి పురస్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా కామేపల్లిలోని బాలత్రిపుర సుందరీసహిత ఇష్టకామేశ్వరీ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సహస్ర హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా శివాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేశగాని వెంకటేశ్వర్లు, పోరండ్ల నెహ్రూ, నాగభూషణరావు, మచ్చ రవి, శ్రీదేవి, సాయి, రామకృష్ణ, నరసింహశర్మ, నాగులమీరా, నాగయ్య, నరసింహారావు, సందీప్, సైదులు, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, నాగేష్, భాగ్యమ్మ, రాజు పాల్గొన్నారు.

‘శ్రీ చైతన్య’ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షలో మమత ఆస్పత్రి రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈమేరకు లెవల్–2 పరీక్షలో 239మంది విద్యార్థులు అర్హత సాధించగా 21మంది నగదు పురస్కారం అందుకున్నారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. సందర్భంగా విద్యార్థులను శుక్రవారం చైర్మన్, డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాళ్లు టీఎల్ఎన్.శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సురేష్ అభినందించారు.

కళాజాతా..


కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

కూసుమంచి: కంటి వెలుగు కార్యక్రమంపై శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కళాకారుల బృందం కళాజాతా నిర్వహించారు. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పథకాలను పాటల రూపంలో కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మిడియాల లక్ష్మ య్య, నలగాటి సుధాకర్, అజయ్, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, కృష్ణ, ముత్తయ్య, రమేష్, వెంకటరత్నం,రోజా, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి మృతి

నేలకొండపల్లి: అనారోగ్యంతో స్వాతంత్ర సమరయోధురాలు కె.కమలమ్మ (97) శుక్రవారం మృతి చెందారు. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన కమలమ్మ భర్త చిన్న వెంకటేశ్వర్లు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడిగా పని చేశారు. ప్రస్తుతం ఆమె హైదాబాద్‌లో నివాసం ఉంటుండగా.. భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

తిరుమలాయపాలెం: పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు శుక్రవారం క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు శ్రీనివాసరావు, రామయ్య, మౌళి, కీర్తి, నారాయణరావు, శ్రీధర్‌కుమార్, లలిత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వాల్తేరు వీరయ్య, ధమాకా
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	తెగింపు
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	వాల్తేరు వీరయ్య

- ఖమ్మంవ్యవసాయం

కష్టాల కడలిలో కార్మికులు..!

భోజనశాల లేక ఇక్కట్లు
- కనీస సౌకర్యాలు కరువు
- గతంలో ఉన్న భోజనశాలలు కూల్చివేత
- నిధులు మంజూరైనా.. నూతన నిర్మాణం చేపట్టని వైనం
- ఇబ్బందులు పడుతున్న వర్కర్లు
- పట్టించుకోని అధికారులు


అపరాల యార్డులో నిలబడి ఇలా..


చెట్ల కింద, చెత్తా చెదారం వద్ద కూర్చొని భోజనం చేస్తున్న కార్మికులు

ఖమ్మంవ్యవసాయం: ‘పేరు గొప్ప ఊరు దిబ్బ’అన్న చందంగా ఉంది ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సౌకర్యాల పరిస్థితి. పంటల క్రయ విక్రయాలు, లావాదేవీల్లో రాష్ట్రంలో రెండోస్థానంలో ఉన్న ఈ మార్కెట్‌లో కార్మికులకు కనీసం భోజనశాలలు కూడా లేవు. నిత్యం కోట్ల రూపాయల పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరుపుతూ ఆదాయాన్ని గడిస్తున్న ఈ మార్కెట్‌లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. పత్తి, మిర్చి కొనుగోళ్లలో రాష్ట్రంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పేరుగాంచింది. ఈ మార్కెట్‌కు ఖమ్మం జిల్లాలో పండిన పంట ఉత్పత్తులతో పాటు పరిసర జిల్లాలు భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, హన్మకొండ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ, గుంటూరు రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాల నుంచి పంటలు తీసుకొచ్చి రైతులు ఈ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. పత్తి, మిర్చి కొనుగోళ్లు అధికంగా జరిగే ఈ మార్కెట్‌లో వ్యాపారులు, కమీషన్ వ్యాపారులు కూడా ఎక్కువగానే ఉన్నారు. ఇక్కడ జరిగే పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల ఆధారంగా 2 వేల మందికి పైగా కార్మికులు ఈ మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఎగుమతి, దిగుమతి హమాలీలు, ట్రాలీ వర్కర్స్, డ్రైవర్స్, దడవాయిలు, రెల్లుడు కార్మికులు, స్వీపర్లు, మహిళా కార్మికులు ఈ మార్కెట్‌లో పనిచేస్తున్నారు. పంట ఉత్పత్తుల సీజన్‌లో రాత్రి పగలు, సెలవు దినాల్లో కూడా కార్మికులు పనిచేస్తారు. పెద్ద సంఖ్యలో పనిచేసే కార్మికులకు కనీసం భోజనశాల కూడా లేదు.

పనిచేసే చోటే భోజనం..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రధాన యార్డు, పత్తి, మిర్చి యార్డులున్నాయి. ఈ యార్డుల్లో పనిచేసే చోటే కార్మికులు తమ వెంట తీసుకొచ్చిన భోజనాలను తింటున్నారు. యార్డుల్లో అక్కడక్కడ రైతులు, కార్మికులు, వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన కూర్చునే సిమెంటు బల్లలపై, చెట్ల నీడన, కార్యాలయాల వెంట, బిడ్డింగ్ హాల్ వెంట, సమీపంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఆవరణలో కూర్చొని భోజనం చేస్తున్నారు. కొందరు యార్డుల్లో ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాల వద్ద ఓ పక్కన కూర్చొని భోజనాలు చేస్తున్నారు. ఇక కొందరు ట్రాలీ బండ్ల(టాటా ఏసీలు)ను భోజనశాలలుగా మార్చుకొని తింటున్నారు. ఓ వైపు పంట ఉత్పత్తులు దింపుతూ, కాలుష్యం వెదజల్లుతున్నా.. ప్రత్యామ్నాయం లేక కార్మికులు ఆయా ప్రాంతాల్లోనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

భోజనశాలలు కూల్చివేత..

మార్కెట్ యార్డుల్లో కార్మికులకు సౌకర్యవంతంగా గతంలో భోజనశాలలు ఉండేవి. ప్రధాన యార్డుగా ప్రస్తుతం ఉన్న మిర్చి యార్డులో కార్మికులు భోజనాలు చేసే విధంగా మంచినీటి సౌకర్యంతో డైనింగ్ ఏర్పాట్లతో పెద్ద షెడ్డు ఉండేది. యార్డుకు మిర్చి విక్రయాలు పెరగటం, భోజనశాల మరమ్మతులకు గురికావటంతో ఆ భోజనశాల షెడ్డును ఏడాదిన్నర క్రితమే కూల్చివేశారు. కానీ, నేటికి తిరిగి నూతన నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల కాలంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ప్రభుత్వం రూ.10కోట్లను అభివృద్ధి పనులకు మంజూరు చేసింది. అయినా భోజనశాలల మాత్రం ఆ నిధులు కేటాయించేందుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో భోజనశాల లేక కార్మికులు తీవ్ర ఇబ్బందలు పడుతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేవు..



మార్కెట్ యార్డుల్లో పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు లేవు.కార్మికులు, రైతులు వ్యాపారులకు మాత్రం కామన్‌గా మంచినీటి సౌకర్యం కల్పించినా.. మార్కెట్‌లో ఆరుకాలం శ్రమించే కార్మికుల కోసం భోజనశాలలను మాత్రం ఏర్పాటు చేయలేదు.

– శివ, హమాలీ కార్మికుడు

పనిచేసే చోటే తింటున్నాం..

కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు వలే మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. దుమ్ము, దూళిలో కూర్చొని పని చేసే చోటే భోజనాలు చేయాల్సి వస్తోంది. అధికారులు త్వరగా చర్యలు తీసుకొని యార్డుల్లో ఎక్కడికక్కడ కార్మికులకు ప్రత్యేకంగా భోజనశాలలు ఏర్పాటు చేయాలి.

– జి. బీరప్ప, హమాలీ కార్మికుడు

పట్టించుకునే నాథుడే లేడు..



నిత్యం మార్కెట్‌లో ఉంటూ రైతులు వ్యాపారులకు సేవలందిస్తున్నాం. కార్మికుల ప్రయోజనం గురించి ఆలోచన చేసిన నాథుడే లేడు. రెండు జతల బట్టలు ఇచ్చి చేతులు దులుపుకుంటారు. ఏదో ఒక సందర్భంలో వ్యాపారులు లేదా మార్కెట్ కమిటీ ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తాయే తప్పా కార్మికుల ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు.

– జె.శ్రీనివాసరావు, హమాలీ కార్మికుడు

భోజనశాలల ఏర్పాటుకు కృషి..



మార్కెట్ యార్డుల్లో భోజనశాలల ఏర్పాటు అంశంపై కృషి చేస్తాం. మార్కెట్ కమిటీ దృష్టికి భోజనశాలల సమస్యను తీసుకువెళ్తాం. మార్కెట్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడ్డాయి. రైతుల ప్రయోజనాలతో పాటు, కార్మికుల ప్రయోజనాలను కూడా పరిగణలోకి తీసుకుంటాం.

– రుద్రాక్షల మల్లేషం, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ ఖమ్మం

జర్నలిస్టుకు మంత్రి చేయూత


జర్నలిస్టుకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రఘునాథపాలెం మండలానికి చెందిన జర్నలిస్టు పాశం వెంకటేశ్వర్లుకు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. జర్నలిస్టు గాయపడిన విషయం తెలియడంతో మంత్రి స్పందించారు. ఈమేరకు శుక్రవారం చైతన్యనగర్‌లోని ఇంట్లో వెంకటేశ్వర్లుకు నాయకుడు రవికిరణ్ ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, యాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవితో పాటు రామకృష్ణ, టీ.ఎస్.చక్రవర్తి, గుద్దేటి రమేష్‌బాబు, బాలబత్తుల రాఘవ, అమరవరపు కోటేశ్వరరావు, యలమందుల జగదీష్, అశోక్, తిరుపతిరావు, ఉపేందర్, బిక్కి గోపి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఓటు విలువ, భారతీయ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల బాధ్యత అనే అంశంపై ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ హైదరాబాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యుడు పి.మోహన్‌రావు ఓటు ప్రాధాన్యతను తెలియజేయగా.. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రంతో పాటు మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాంబశివరావు, జర్పుల రమేష్, రావివర్ధన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి


నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశ్

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈసారి బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నెహ్రూనగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడంతో పాటు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాసాని బ్రహ్మం, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా లగిశెట్టి మహేశ్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రామాచారి, రవికుమార్, మల్లేశ్, రాజ్‌కుమార్, రమణయాదవ్, కార్యాలయ ఇన్‌చార్జ్ పోతగాని రమణకుమార్, సుగుణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

‘లంపీస్కిన్’పై అర్చకుడి విస్తృత ప్రచారం


గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నేలకొండపల్లి: పశువులను వేధిస్తున్న లంపీస్కిన్ వ్యాధిపై ఓ అర్చకుడు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడిగా పని చేస్తున్న పంతంగి పవన్‌కుమార్‌శర్మకు చెందిన ఓ ఆవు ఇటీవల లంపీస్కిన్ వ్యాధి సోకింది. దీంతో చలించిపోయిన ఆయన వాటి సంరక్షణ కోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాడు. గ్రామంలోని ప్రధాన సెంటర్లలో వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపేలా హనుమాన్ యూత్ సభ్యులతో కలిసి ఫ్లెక్సీలు ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో పలువురు రైతులు అర్చకుడిని అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు సాయితేజ


సాయితేజ

నేలకొండపల్లి: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన పలెపొంగు సాయితేజ ఎంపికయ్యాడు. ఇటీవల మందమర్రిలో జరిగిన జూనియర్ బాలుర రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన అయనను తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్ల శ్రీకాంత్, డాక్టర్.పి.రఘునందన్, సంయుక్త కార్యదర్శులు కృష్ణ, పాముల శ్రీనివాసరావుతో పాటు ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, సర్పంచ్ నెల్లూరి అనురాధ అభినందించారు.

సమాజ రుగ్మతలను పారదోలాలి

ఖమ్మంమయూరిసెంటర్: సమాజంలో పేరుకుపోయిన రుగ్మతల అంతం కోసం లౌకిక శక్తులు కృషి చేయాలనీ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ తల్లి వంగూరి దేవకరుణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. శుక్రవారం ఖమ్మం నగరంలో సంతాపసభ నిర్వహించారు. దేవకరుణ చిత్రపటానికి నివాళులర్పించిన పోటు రంగారావు, పుసులూరి నరేందర్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, జిల్లా నాయకుడు సీవై పుల్లయ్య మాట్లాడారు. ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్, నాగేశ్వరరావు, బందే వెంకయ్య, కె.అర్జున్‌రావు, ఎస్.నాగేశ్వరరావు, సంధ్య, నరసింహారావు, రాకేష్, జి.రామయ్య, కె.శ్రీనివాస్, మంగతాయి పాల్గొన్నారు.

పొంగులేటి విస్తృత పర్యటన


ఖమ్మంరూరల్: అమ్మరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడును సందర్శించి శుభ కార్యక్రమాలతో పాటు పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చి ఆర్థిక సాయమందించారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట మద్దినేని బేబి స్వర్ణకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, వడ్డెబోయిన శ్రీనివాసరావు, దుంపల రవికుమార్, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్బాయ్, చింతమళ్ల గురుమూర్తి, తాళ్లూరి రాము, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, కాంపాటి రమేష్, కరాటే వేణు, మేడా విజయ్‌కుమార్, ఆటో ప్రసాద్, ఏపీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గూడురుపాడు పర్యటనలో పొంగులేటి వెంట ఎం.కిషోర్ రెడ్డి, నూతగాని ఉపేందర్, వెంకటరెడ్డి, వెంకి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో శుక్రవారం భోజన విరామ సమయంలో వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలు ప్రకటించాలని డిమాండ్‌చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు న్యాయమైన కోర్కెలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాయి, అఖిల్, సోహెల్, సత్యనారాయణ, వర్షిత్, శంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక బిల్లులు వసూళ్లపై ఆందోళన

కామేపల్లి(కారేపల్లి): ఏసీడీ ద్యూ పేరుతో ట్రాన్స్‌కో అధికారులు అధిక విద్యుత్ బిల్లులు వసూళ్లు చేస్తున్నారని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముచ్చర్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేశారు. ఏసీడీ ద్యూ పేరుతో రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు అధిక బిల్లులు వసూళ్లు చేస్తున్నారని, అక్కడికి వచ్చిన కరెంట్ బిల్లు కలెక్టర్‌ను అడ్డుకున్నారు. పేద మధ్యతరగతి ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం అధిక విద్యుత్ బిల్లులను వేసి మోయలేని భారాన్ని మోపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోలా వెంకటేశ్వర్లు, వనం నాగేశ్వరరావు, గాడేపల్లి సైదులు, వేముల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను కేవీపీఎస్ వ్యవస్థాపకుడు, దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు, ఖమ్మం జిల్లా కేవీపీఎస్ సైకిల్ యాత్ర రథసారథి తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, జిల్లా అధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, జిల్లా నాయకులు బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, పాపిట్ల సత్యనారాయణ, కుక్కల సైదులు, నకరికంటి చిరంజీవి, జి.కిరణ్, గుమ్మడి భిక్షం, ఎస్‌కె.సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి


బహుమతులు అందజేస్తున్న పోటు ప్రసాద్

రఘునాథపాలెం: క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేటప్పుడు క్రీడాస్ఫూర్తితో మెలిగి గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. మండలంలోని కామంచికల్ పంచాయతీలో ఇటీవల సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హనుమంతు క్రిష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత యువజన సమైక్య, అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం పోటీల్లో విజేతలుగా నిలిచిన టీమ్‌లకు ఆయన బహుమతుల ప్రదానం చేసి మాట్లాడారు. యువతలో ఐక్యమత్యాన్ని పెంపొందించేందుకు భవిష్యత్‌లో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి యువత ఐక్యతకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు పుచ్చకాయల కమలాకర్, సిద్దినేని కరుణకుమార్‌లతో పాటు బొప్పి గాంధీ, మోహన్‌రావు,వాసు,దాసరి అశోక్, జంగం మురళి, ఉపేందర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఇస్తే.. రోడ్డున పడేశారు

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణానికి మట్టి ఇచ్చినందుకు డబ్బులు చెల్లించలేదని.. రైతులు రాస్తారోకో నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలంలోని చిరుమర్రి గ్రామానికి చెందిన పల్లపాటి వెంకటేశ్వర్లు, ఉపేందర్‌లకు ఉన్న రెండున్నర ఎకరాల భూమిలోని మట్టిని జాతీయ రహదారి నిర్మాణానికి విక్రయించారు. వారికి రూ. 2 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. నెల రోజులు దాటిన రైతులకు డబ్బులు ఇవ్వటం లేదని ఆగ్రహించి రైతులు సదరు కంపెనీ వద్ద శుక్రవారం కుటుంబ సభ్యులతో సహా రాస్తారోకో నిర్వహించి వాహనాలు పోకుండా అడ్డుకున్నారు. దీంతో కూసుమంచి–నేలకొండపల్లి రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య సిబ్బందితో చేరుకుని ఆందోళనకారులతో చర్చించి ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా, తమకు న్యాయం జరగకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: హమాలీ, భవన నిర్మాణం, గ్రామపంచాయతీ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన హక్కులు కల్పించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు 30శాతం పీఆర్సీ అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తర్వాత సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు 30శాతం పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, డి. శ్రీనివాసరావు, పి.రాందాస్, ఆవుల అశోక్, వై.బాబు తదితరులు పాల్గొన్నారు.

తీగల వంతెనతో మరింత అభివృద్ధి


మాట్లాడుతున్న గుండాల కృష్ణ, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మున్నేరుపై నిర్మించనున్న కేబుల్ బ్రిడ్జి ద్వారా త్రీ టౌన్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ నాయకుడు, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ సభలో మున్నేరు వంతెనపై తీగల బ్రిడ్జిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన 24గంటల్లోనే రూ.180కోట్ల నిధులను సీఎం కేసీఆర్ మంజూరు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వాన త్రీటౌన్ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. గోళ్లపాడు ఛానెల్ ఆధునీకరణ, రూ.10కోట్లతో మార్కెట్ల అభివృద్ధి, రోడ్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పసుమర్తి రామ్మోహన్‌రావు, దోన్వాన్ సరస్వతి, బీఆర్ఎస్ నాయకులు తోట రామారావు, వీరభద్రం, కన్నం ప్రసన్న, ధనాల శ్రీకాంత్, బోజడ్ల రామ్మోహన్, పత్తిపాక రమేష్, యర్రా అప్పారావు, రాజేష్, పాలడుగు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

‘లింగాల’ కృతజ్ఞతలు..

ఖమ్మంమామిళ్లగూడెం: మున్నేరులపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు బీఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం పోరాట ఫలితమే నూతన బ్రిడ్జి నిర్మాణం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం పోరాటాల ఫలితంగానే ఖమ్మం మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని ఆ పార్టీ ఖమ్మం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పార్టీ ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణం కోసం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు, సంతకాల సేకరణ, ధర్నాలు నిర్వహించామని గుర్తుచేశారు. బ్రిడ్జి నిర్మాణంతో పాటు మున్నేరుకు ఇరువైపుల కరకట్ట నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ త్రీటౌన్ కమిటీ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, వజినేపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, పత్తిపాక నాగసులోచన, షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.